సాక్షి
సిద్దిపేట
శనివారం ı 11 ı మార్చి ı 2023



'నాచగిరి'ముస్తాబు
నేటి నుంచి 22వ తేదీ వరకు వర్గల్ మండలం నాచారంగుట్టలో ఉత్సవాలు జరగనున్నాయి. ఇందుకు లక్ష్మీనారసింహుడిని అందంగా ముస్తాబు చేశారు. 8లో..



పాతకక్షలతోనే ప్రాణం తీశారు
పాతకక్షలతో వ్యక్తిని హతమార్చిన ఘటనలో 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు శుక్రవారం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో మెదక్ డీఎస్పీ సైదులు తెలిపారు. 8లో..



వాడీవేడిగా సర్వసభ్య సమావేశం
మిరుదొడ్డి మండల సర్వసభ్య సమావేశంలో నిధుల కేటాయింపు విషయంలో ఎంపీపీ, ఎంపీటీసీల మధ్య తలెత్తిన వివాదం తారా స్థాయికి చేరింది. 9లో..

న్యూస్‌రీల్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి



జడ్జి ప్రియాంకను సన్మానిస్తున్న దృశ్యం

గజ్వేల్‌రూరల్: మహిళలు తమలోని ప్రతిభను చాటుతూ అన్ని రంగాల్లో రాణించాలని గజ్వేల్ అదనపు ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ప్రియాంక సూచించారు. అంతర్జాతీయ మహిళా న్యాయమూర్తుల దినోత్సవం సందర్భంగా శుక్రవారం పట్టణంలోని కోర్టు ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళలు చైతన్యవంతులై ఉన్నత స్థానాల్లో నిలవాలన్నారు. సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా దూసుకుపోతున్నారని గుర్తు చేశారు. తమ హక్కుల కోసం పోరాడాలని, మహిళల రక్షణకు ప్రత్యేక చట్టాలున్నాయని వివరించారు. ఈ సందర్భంగా జడ్జి ప్రియాంకను మండల్ లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో బాలల సంక్షేమ సమితి సభ్యులు దేశబోయిన నర్సింలు, బార్ అసోసియేషన్ సభ్యులు, మండల్ లీగల్ సర్వీస్ సిబ్బంది నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో పెరగనున్న మానసిక దృఢత్వం

బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి



టాస్ వేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

హుస్నాబాద్: క్రీడలు మానసిక, శారీరక దృఢత్వాన్ని పెంపొందిస్తాయని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ నేతృత్వంలో హుస్నాబాద్ అసెంబ్లీ పరిధిలో ఖేల్ కరీంనగర్, కరీంనగర్ పార్లమెంట్ స్థాయి క్రీడోత్సవాల్లో భాగంగా హుస్నాబాద్‌లో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ పోటీలను శ్రీకాంత్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. మొదట హుస్నాబాద్ లిటిల్ ఫ్రెండ్స్ వర్సెస్ సైదాపూర్ టీమ్‌ల మధ్య మ్యాచ్ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడోత్సవాల్లో భాగంగా క్రికెట్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా ఇన్‌చార్జి చాడ శ్రీనివాస్‌రెడ్డి, బొమ్మ శ్రీరాంచక్రవర్తి, జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, దొడ్డి శ్రీనివాస్, బత్తుల శంకర్‌బాబు, విద్యాసాగర్, వేణుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రూ.1.29 కోట్లతో పాఠశాల భవన నిర్మాణం



పనులను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు

వర్గల్(గజ్వేల్): వర్గల్ మండలం నాచారం జెడ్పీ హైస్కూల్ నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం రూ.1.29 కోట్ల నిధులు మంజూరు చేసింది. శుక్రవారం భవన నిర్మాణ పనులకు సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు వెంకటేష్‌గౌడ్ ప్రారంభోత్సవం చేశారు. కార్యక్రమంలో ఏఈ అరవింద్, ప్రధానోపాధ్యాయులు శంకర్‌రెడ్డి పాల్గొన్నారు. స్కూల్ భవనానికి నిధులు మంజూరు చేసిన ఆర్థిక మంత్రి హరీశ్‌రావు, విద్యాశాఖ మంత్రి సబితాఇంద్రారెడ్డికి ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

నేడు, రేపు సిద్దిపేటలో శతావధానం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేటలోని శ్రీ లలితా చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా శని, ఆదివారం శతావధానం నిర్వహిస్తున్నారు. ఈ మేరకు దేవాలయ వ్యవస్థాపకులు పండరి రాధాకృష్ణ, రామంభజే శ్యామలం అధ్యక్షుడు సింగీతం నరసింహారావు, సరస్వతి రామశర్మ, బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశంలు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. శతావధాని డాక్టర్ పట్వర్ధన్ చే ఈ శతావధానము నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు, సాహిత్యప్రియులు రెండు రోజులు విచ్చేసి శతావధానమును విజయవంతం చేయాలని కోరారు.

కాంగ్రెస్‌లో వర్గపోరు

- దుబ్బాకలో నలుగురు.. జనగామలో ఇద్దరు
- నియోజకవర్గాల్లో పోటాపోటీగా యాత్ర
- సిద్దిపేటలో ఎవరికి వారే.. కార్యక్రమాలు
- అయోమయంలో హస్తం శ్రేణులు
- తనకే టికెట్ అంటూ ప్రచారం చేసుకుంటున్న నాయకులు



సాక్షి,సిద్దిపేట/ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్‌లో అంతర్గత వర్గపోరు రోజురోజుకు పెరుగుతోంది. పార్టీ పిలుపునిచ్చే కార్యక్రమాలతో మొదలుకుని హాథ్‌సే హాథ్ జోడో యాత్ర వరకు ఎవరికీ వారే అన్నట్లుగా సాగుతున్నారు. ఇప్పటికే ఎన్నికల వాతావరణం కనిపించడం.. పార్టీలో గ్రూపుల లొల్లితో కార్యకర్తలు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరి క్యాడర్‌తో వారు ప్రజల్లోకి వెళ్లి విస్తృతంగా తిరుగుతున్నారు. తనకే టికెట్ అంటూ ఎవరికి వారు ప్రచారం చేసుకుంటున్నారు. దుబ్బాక, సిద్దిపేట, జనగామ నియోజకవర్గాల్లో కాంగ్రెస్ శ్రేణులు వర్గాలుగా విడిపోయి నువ్వా? నేనా అన్నట్లు కార్యక్రమాల్లో పాల్గొంటున్నాయి.

జనగామలో పొన్నాల, కొమ్మూరి..

జనగామ నియోజకవర్గంలోని మద్దూరు మండలం లద్నూర్‌లో ఈనెల 3న మాజీ టీపీసీసీ అధ్యక్షుడు, మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య హాథ్‌సే హాథ్ జోడో యాత్రను ప్రారంభించి జాగిల్లాపూర్, రేబర్తి, మంగపల్లి గ్రామాల్లో పాదయాత్ర నిర్వహించారు. 9న కొమురవెల్లి మండల కేంద్రంలో పొన్నాల వర్గీయులు పాదయాత్ర నిర్వహించారు. 10న కొమురవెల్లి మల్లికార్జున స్వామి దేవాలయంలో మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి హాథ్ సే హాథ్ జోడో యాత్రను కొమురవెల్లిలో నిర్వహించారు.

దుబ్బాకలో ఆ నలుగురు

దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్‌రెడ్డి, సినీనటి కత్తి కార్తీక, మిరుదొడ్డి పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాల్‌రెడ్డి వేర్వేరుగా కుంపటి పెట్టుకొని సమావేశాలు, సభలు, యాత్రలు ఎవరికీ వారే చేపడుతున్నారు. ఫిబ్రవరి 1న తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లిలోని రేణుక ఎల్లమ్మ దేవాలయం నుంచి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పాదయాత్ర చేపట్టారు. ఇప్పటి వరకు తొగుట, రాయపోలు మండలాలు పూర్తికాగా ప్రస్తుతం దౌల్తాబాద్ మండలంలో యాత్ర చేస్తున్నారు. ఫిబ్రవరి 5న దుబ్బాక పట్టణంలోని రేకులకుంట మల్లికార్జున స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాదయాత్రను ప్రారంభించారు. గడగడపకు తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దుబ్బాక పట్టణంలో సినీనటి కత్తి కార్తీక ఫిబ్రవరి 12న బాలాజీ ఫంక్షన్ హాల్‌లో కాంగ్రెస్ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రను నిర్వహించారు. అలాగే పరామర్శలు, ఆర్థిక సహాయాలతో ప్రజలతో మమేకం అవుతున్నారు మిరుదొడ్డి పీఏసీఎస్ మాజీ చైర్మన్ గాల్‌రెడ్డి.

సిద్దిపేటలో ఎవరికి వారే..

సిద్దిపేట నియోజకవర్గంలో ఎవరికివారే పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దర్పిపల్లి చంద్రం, టీపీసీసీ కార్యదర్శి పూజల హరికృష్ణ, జిల్లా ఓబీసీ సెల్ అధ్యక్షుడు సూర్యవర్మ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బొమ్మల యాదగిరి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు తాడూరి శ్రీనివాస్‌గౌడ్, గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి సిద్దిపేట నియోజకవర్గం నుంచి టికెట్ ఆశిస్తున్నారు. వీరందరూ ఒకే కార్యక్రమంలో పాల్గొన్న సందర్భాలు లేవు. వీరు ఎవరికి వారు తమకే టికెట్ వస్తుందని ప్రచారం చేసుకుంటునట్లు సమాచారం. ఎన్నికలు రాకముందే పరిస్థితి ఇలా ఉంటే మున్ముందు ఎలా ఉంటుందోనని కార్యకర్తలు ఆందోళన చెందుతున్నారు. వీరందరిని ఒక్కతాటి మీదకు తీసుకురావాలని కాంగ్రెస్ కార్యకర్తలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

పకడ్బందీగా పది పరీక్షలు

- 84 పరీక్ష కేంద్రాలు.. 14,651 మంది విద్యార్థులు
- అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్

సిద్దిపేటరూరల్: పదో తరగతి పరీక్షలను పగడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఏప్రిల్ 03 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో కలెక్టరేట్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. పరీక్షలను సమర్థవంతంగా శాఖల వారీగా ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా రెగ్యులర్ 14,186 మంది, ప్రైవేట్ 07 మంది, మొత్తం 14,193 మంది విద్యార్థులు, ఒకేషనల్ విద్యార్థులు 1,459 మంది పరీక్ష రాయనున్నారన్నారు. మొత్తం 84 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. 84 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 84 మంది డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 05 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 07 రూట్ ఆఫీసర్లు, 07 అడిషనల్ రూట్ ఆఫీసర్లను, ప్రతీ 20 మంది విద్యార్థులకు ఒకరి చొప్పున ఇన్విజిలేటర్లను నియమించినట్లు తెలిపారు. ఆర్టీసీ సమయానికి పరీక్ష కేంద్రాలకు బస్సులు నడపాలన్నారు. విద్యుత్ శాఖ కోతలేని విద్యుత్ సరఫరా చేయాలన్నారు. వైద్యఆరోగ్యశాఖ వారు అప్రమత్తంగా ఉండి పరీక్ష కేంద్రం వద్ద అవసరమైన ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులను, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాశాఖాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్వో లక్ష్మి, అడిషనల్ డీసీపీ మహేందర్, సెక్టోరల్ అధికారి రామస్వామి, లక్ష్మయ్య, శ్రీనివాస్, డిస్ట్రిక్ట్ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసర్ దుర్గా ప్రసాద్, జిల్లా ఖజానాశాఖధికారి బాలరాజు, డీపీఆర్ఓ రవికుమార్, మహేశ్వరీ, పోస్టల్ అధికారి కరుణాకర్‌రెడ్డి, విద్యుత్ శాఖ అధికారి మహేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షల నిర్వహణపై అవగాహన

జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్



మాట్లాడుతున్న సూర్యప్రకాశ్

సిద్దిపేటఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణపై శుక్రవారం సిద్దిపేట బాలుర జూనియర్ కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇంటర్ విద్యాధికారి సూర్యప్రకాశ్ మాట్లాడారు. ఈ నెల 15 నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేస్తున్నట్లు వివరించారు. పరీక్షల విధుల్లో పాల్గొంటున్న అధ్యాపకులు జాగ్రత్తగా, ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షలను ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. పరీక్షల కమిటీ సభ్యుడు మంగరాజు పరీక్షలకు ముందు నిర్వహించాల్సిన విధులను గూర్చి వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి పరీక్ష సమయంలో చేయాల్సిన పనులను గూర్చి, పరీక్ష పూర్తయిన తర్వాత చేయాల్సిన పనులను మరో పరీక్షల కమిటీ సభ్యుడు విజయేందర్‌రెడ్డి వివరించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు నర్సింహాచారి, ధనరాజ్, జిల్లా ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాస్, కార్యదర్శి కిషన్, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కనకచంద్రం తదితరులు పరీక్షల నిర్వహణపై పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆయా పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్(సీఎస్), డిపార్ట్‌మెంట్ ఆఫీసర్(డీఓ) అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్(ఏసీఎస్) హాజరయ్యారు.

బీడు భూములు సస్యశ్యామలం



నీటిని విడుదల చేస్తున్న ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత

- దామరకుంట వద్ద గోదావరి జలాల విడుదల
- ఎఫ్‌డీసీ ఛైర్మన్ ప్రతాప్‌రెడ్డి, ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే సునీత

మర్కూక్(గజ్వేల్): గోదావరి జలాలతో బీడు భూములు సస్యశ్యామలం అవుతున్నాయని రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గొంగిడి సునీత అన్నారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం దామరకుంట రెగ్యులేటర్ కాల్వలోకి కొండపోచమ్మసాగర్ నుంచి వారు నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో 30 వేల ఎకరాలు, ఆలేరు నియోజకవర్గంలో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. తొమ్మిది స్టేషన్లు దాటి పదో స్టేషన్‌లో నీటిని విడుదల చేయడం తమ అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ నీటితో ఆలేరు నియోజకవర్గంలోని 20 చెరువులను నింపవచ్చనన్నారు. ప్రతి గుంట భూమికి సాగు జలాలు అందించే లక్ష్యంతో సీఎం కేసీఆర్ కృషితో 2020లోనే తుర్కపల్లి ప్రధాన కాల్వ అందుబాటులోకి వచ్చిందన్నారు. కొండపోచమ్మ సాగర్ నుంచి గోదావరి జలాలు శివారు వెంకటాపూర్ వద్ద ప్రారంభమై దామరకుంట నుంచి ఆలేరులోని తుర్కపల్లి మండలంలో 14 గ్రామాల చెరువుల్లోకి చేరుతాయన్నారు. అక్కడి నుంచి చిన్నచిన్న కాలువల ద్వారా బొమ్మలరామారం మండలంలోని 14 చెరువులను నింపుతామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పాండుగౌడ్, జెడ్పీటీసీ మంగమ్మరాంచంద్రం, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కరుణకర్‌రెడ్డి, ఎంపీపీ ఉపాధ్యక్షుడు బాల్‌రెడ్డి, ఎంపీటీసీల ఫోరం మండలాధ్యక్షుడు కృష్ణయాదవ్, సర్పంచ్ గాయత్రీ బాల్‌నర్సయ్య, తుర్కపల్లి ఎంపీపీ భూక్య సుశీల, బొమ్మాల రామారం ఎంపీపీ సుధీర్‌రెడ్డి, వివిధ మండలాల నాయకులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు

జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

ములుగు(గజ్వేల్): ఆయిల్‌పామ్ సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని, ఈ పంట సాగుతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్ సూచించారు. ములుగు మండలంలోని తున్కి బొల్లారంలో మండల వైస్ ఎంపీపీ దేవేందర్ రెడ్డి సాగుచేసిన ఆయిల్‌పామ్ తోటతో పాటు క్షీరసాగర్‌లో రైతు రాములు సాగుచేసిన వరి వెదసాగు క్షేత్రాన్ని శుక్రవారం సందర్శించి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగుకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతను కల్పిస్తూ సబ్సిడీ అందజేస్తుందన్నారు. రైతులు ఆయిల్‌పామ్ సాగులో సరైన యాజమాన్య పద్ధతులు పాటించినట్లయితే అధిక దిగిబడులు సాధించవచ్చని తెలిపారు. మండల వ్యవసాయ అధికారిణి ప్రగతి, ఏఈఓ రమ, రైతులు పాల్గొన్నారు.



పామాయిల్ సాగుపై సూచనలు ఇస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి శివప్రసాద్

విగ్రహ ప్రతిష్ఠాపనకు అంతా సిద్ధం

- ముస్తాబైన సీతారామ ఉమామహేశ్వరాలయం
- 11, 12, 13 తేదీల్లో ఉత్సవాలు



సీతారామ ఉమామహేశ్వరాలయం

గజ్వేల్‌రూరల్: ఐదు శతాబ్దాల ప్రాశస్త్యం కలిగిన గజ్వేల్ పట్టణంలోని సీతారామ ఉమామహేశ్వర దేవాలయ పునఃర్నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. 11, 12, 13 తేదీల్లో దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. ఏటా భద్రాచలంలో సీతారాముల కల్యాణోత్సవం జరిగిన తర్వాత ఆ తలంబ్రాలను ఇక్కడకు తెచ్చి శ్రీరామ నవమి తర్వాత పదిహేను రోజులకు ఒకే మండపం(పందిరి)లో శ్రీసీతారామ ఉమామహేశ్వర కల్యాణోత్సవాన్ని జరపడం ఆనవాయితీగా వస్తుంది. ఐదో రోజు సీతారామచంద్రస్వామి రథోత్సవం వైభవంగా జరుగుతుంది. 2019లో సీఎం కేసీఆర్ ఆలయ పునఃర్నిర్మాణానికి రూ.5కోట్లు కేటాయించారు. సీతారామ ఉమామహేశ్వరాలయాల్లో గర్భగుడితో పాటు ప్రధాన స్తంభాలపై దశావతారాలు, వైష్ణవ సంప్రదాయం ఉట్టిపడేలా దేవతామూర్తుల ప్రతిమలను అందంగా చెక్కారు. ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం ఈ దేవాలయాన్ని దేవదాయ శాఖ పరిధిలోకి తీసుకొచ్చింది.

దుబ్బాక పశువుల సంత@ రూ.15.12లక్షలు



వేలం నిర్వహిస్తున్న అధికారులు

దుబ్బాకటౌన్: దుబ్బాక పశువుల, కూరగాయల సంతకు మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ పాతూరి గణేశ్‌రెడ్డి వేలంపాట నిర్వహించారు. కాగా పశువుల సంతను రూ.15.12లక్షలకు కలకొక్కుల రాజేశం దక్కించుకున్నారు. కాగా గతేడాది ఈ సంతకు రూ.9.23లక్షల ఆదాయం మాత్రమే వచ్చింది. కూరగాయల సంతకు వేలం సర్కార్‌వారి సవాల్ రూ.15 లక్షల పైనుంచి పాడాల్సి ఉండగా వేలంలో పాల్గొన్న వారు కేవలం రూ.5 లక్షలకుపై మాత్రమే పాడడంతో దీన్ని వాయిదా వేశారు. దీనికి వేలం నిర్వహించే తేదీని మళ్లీ నిర్ణయిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల రికార్డులు పరిశీలన

మిరుదొడ్డి(దుబ్బాక): మండల పరిధిలోని కాసులాబాద్ ప్రాథమిక పాఠశాల, అక్బర్‌పేట - భూంపల్లి మండల పరిధిలోని కూడవెల్లి ప్రాథమిక పాఠశాలను ఎఫ్ఎల్ఎన్ (ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ) రాష్ట్ర పరిశీలక బృందం శుక్రవారం పరిశీలించింది. ఈ సందర్భంగా వారు పాఠశాలల రికార్డులతో పాటు మధ్యాహ్న భోజన నిర్వహణ, ఉపాధ్యాయుల బోధనాతీరు, విద్యార్థుల భాషా ప్రగతిని పరిశీలించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఎన్ రాష్ట్ర పరిశీలక బృందం సభ్యులు భృంగి ప్రసన్న కుమార్, పెరుమాండ్ల శ్రీనివాస్, వెంకటేష్, హెచ్ ఎం పీవీ సత్యకుమార్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న సభ్యులు

డబుల్ ఇళ్ల జాబితాపై గందరగోళం

- అర్హుల పేర్లు లేవంటూ ఆగ్రహం
- దుబ్బాక మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన



అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేస్తున్న కౌన్సిలర్లు



జాబితాను పరిశీలిస్తున్న దరఖాస్తుదారులు

దుబ్బాకటౌన్: రెండో విడత డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితా దుబ్బాక పట్టణంలో శుక్రవారం తీవ్ర గందరగోళానికి దారి తీసింది. దుబ్బాకలో సుమారుగా 870కిపైగా ఇళ్లను జీ ప్లస్ టు పద్ధతిలో ప్రభుత్వం నిర్మించింది. ఇటీవల మొదటి విడతలో 450 మందికి పైగా లబ్ధిదారులకు ఇళ్లను పంపిణీ చేశారు. కాగా ఇంకా దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య మిగిలిపోవడంతో వారికి రెండో విడతలో ఇళ్లు ఇస్తామని అధికారులు వివరించారు. ఈ క్రమంలోనే 15 రోజుల క్రితం వరకు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దీంతో సుమారుగా 200 ఇళ్లకు 941 దరఖాస్తులు వచ్చాయి. దీంతో అర్హుల జాబితా ఎంపిక అధికారులకు ఇబ్బందిగా మారింది. ఎట్టకేలకు కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా విచారణ చేపట్టి శుక్రవారం రెండో విడత ఎంపిక జాబితాను విడుదల చేశారు. ఇందులో చాలా మంది పేర్లు కనబడకపోవడంతో తీవ్ర ఆందోళనకు గురయ్యారు. కన్నీరు పెట్టుకుంటూ అధికారులకు శపనార్థాలు పెట్టారు. నిజమైన పేదలకు ఇళ్లు రాలేదని .. ఒక్కో ఇంట్లో ఇద్దరు.. ముగ్గురికి వచ్చిందని మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన వ్యక్తం చేశారు.

అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు

రెండో విడత లబ్దిదారుల జాబితాలో చాలామంది అర్హుల పేర్లు లేవంటూ దీనిపై మళ్లీ విచారణ చేపట్టి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూడాలంటూ మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి ఆధ్వర్యంలో కౌన్సిలర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. ఆయన అందుబాటులో లేకపోవడంతో అదనపు కలెక్టర్ ముజామ్మిల్‌ఖాన్‌కు ఫిర్యాదు అందజేసి సమగ్రంగా విచారణ చేపట్టి న్యాయం చేయాలని విన్నవించారు.

క్లుప్తంగా

ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

పటాన్‌చెరు టౌన్: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, పరిమితి మించి ప్రయాణికులనుతీసుకెళితే చర్యలు తప్పవని ట్రాఫిక్ ఎస్‌ఐలు రాములు, ఆంజనేయులు అన్నారు. శుక్రవారం పట్టణంలోని బస్టాండ్ సమీపంలో, ఇస్నాపూర్ చౌరస్తాలో ఆటోలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి రోజు వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నామన్నారు.

అకస్మాత్తుగా మంటలు
ఫైరింజన్ రాకతో తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

సంగారెడ్డిటౌన్: పోతిరెడ్డిపల్లిలోని మారుతీ షోరూమ్ వెనకాల శుక్రవారం అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. అవి భారీస్థాయిలో ఎగిసిపడడంతో స్థానికులు భయాందోళనకు లోనయ్యారు. స్థానికులు వెంటనే అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో అక్కడ చేరుకొని మంటలను ఆర్పివేశారు. దీంతో పెను ప్రమాదం తప్పింది.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన వాహనదారులకు సిద్దిపేట న్యాయమూర్తి శుక్రవారం జరిమానా విధించారు. సిద్దిపేట పట్టణంలోని నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీఓ కార్యాలయ చౌరస్తా, రాజీవ్ రహదారిపై సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో నిర్వహించిన తనిఖీల్లో వాహనదారులను బ్రీత్‌ఎనలైజర్‌తో పరీక్షించగా నలుగురు మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా విచారణ చేసిన న్యాయమూర్తి రమేష్‌బాబు వారికి రూ.8,500 జరిమానా విధించారు.

యువకుడు అదృశ్యం



నవీన్‌కుమార్‌రెడ్డి (ఫైల్)

కొండపాక(గజ్వేల్): మండల పరిధిలోని సిర్సనగండ్ల గ్రామానికి చెందిన ఓ యువకుడు అదృశ్యమయ్యాడు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం..ఈ నెల 3వ తేదీన నవీన్‌కుమార్‌రెడ్డి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. అదేరోజు తిమ్మారెడ్డిపల్లి శివారులో రాజీవ్ రహదారిపై ఉన్న కొమురవెల్లి కమాన్ వద్ద హైదరాబాద్ వైపునకు వెళుతున్న బస్సు ఎక్కాడు. తల్లిదండ్రులు ఫోన్ చేయగా, స్విచ్ఛాప్ వచ్చింది. బంధువులు, తెలిసినవారి వద్ద ఆరా తీసినా నవీన్‌కుమార్‌రెడ్డి ఆచూకీ లభించలేదు. తండ్రి ప్రభాకర్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాచగిరి ముస్తాబు

నేడు బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

వర్గల్(గజ్వేల్): బ్రహ్మోత్సవాలకు లక్ష్మీనారసింహుడు ముస్తాబయ్యాడు. శనివారం నుంచి 22వ తేదీ వరకు వర్గల్ మండలం నాచారంగుట్టలో ఉత్సవాలు జరగనున్నాయి. ప్రధాన ఆలయం, విమాన గోపురం, తూర్పు, ఉత్తర ద్వారాలు, సభామండపం, కల్యాణ మండపాలను రంగులతో తీర్చిదిద్దారు. ఆలయం, ఆలయ ప్రాంగణాన్ని రంగురంగుల విద్యుద్దీపాల వరుసలతో అలంకరించారు. పలుచోట్ల స్వాగత తోరణాలు కూడా ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే భక్తులు బస చేసేందుకు సత్రాలు సిద్ధం చేశారు. ఎండల నేపథ్యంలో అదనంగా చలవ పందిళ్లు కూడా నిర్మించారు. క్షేత్ర పరిసరాలు, హల్దీవాగు పరీవాహక ప్రాంతాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు తొలగించి చదును చేశారు.



నాచగిరి వద్ద అలుగుపోస్తున్న హల్దీవాగు

క్షేత్ర మహత్యం



గార్గేయ మహర్షి, నవనాథ మునులు తపమాచరించిన ప్రదేశమే నాచగిరి. శేషశాయి మాదిరి గుహలో స్వామివారు స్వయంభువుగా కొలువుదీరారు. క్షేత్రం ముందు నుంచి పరవళ్లు తొక్కుతూ ఉత్తరదిశలో సాగిపోయే హరిద్ర నది (హల్దీవాగు) రమణీయ దృశ్యకావ్యంలా గోచరిస్తుంది. కొండగుహల్లో కొలువైన శ్రీస్వామివారిని దర్శించుకుంటే శత్రుబాధ, భూత, ప్రేత, పిశాచ బాధలు తొలగిపోతాయని, దీర్ఘరోగాలు నయమవుతాయని, కోర్టు తగాదాలు, కుటుంబ శాంతి, వివాహం, సంతానం సమకూరుతుందని భక్తులు విశ్వసిస్తారు.

బ్రహ్మోత్సవాలు ఇలా..

- 11వతేదీన బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ
- 12న ధ్వజారోహణం
- 13న సోమవారం రాత్రి 10 గంటలకు స్వామివారి తిరుకల్యాణోత్సవం
- 14న హంస వాహనసేవ
- 15న గజవాహనసేవ
- 16న శేషవాహన సేవ
- 17న పెద్దగరుడసేవ
- 18న హనుమంతోత్సవ సేవ
- 19న పొన్న వాహనసేవ
- 20న సోమవారం రాత్రి రథోత్సవం
- 21న తెల్లవారుజామున దివ్యవిమానరథంపై స్వామివారి ఊరేగింపు, చక్రవరి, పూర్ణాహుతి
- 22న శతఘటాభిషేకం, ఉగాది పంచాంగ శ్రవణం ఉంటుంది.



గుహలో కొలువైన శ్రీలక్ష్మీనారసింహుడు

పట్టువస్త్రాలు సమర్పించనున్న మంత్రి హరీశ్‌రావు

నాచగిరి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఈ నెల 13వ తేదీన శ్రీలక్ష్మీనృసింహస్వామివారి తిరుకల్యాణోత్సవంలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు పాల్గొని ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని ఆలయ ఈఓ సుధాకర్‌రెడ్డి తెలిపారు.

పాతకక్షలతోనే ప్రాణం తీశారు



వివరాలు వెల్లడిస్తున్న మెదక్ డీఎస్పీ సైదులు

బద్దారం హత్యకేసులో 14మంది రిమాండ్

టేక్మాల్(మెదక్): పాతకక్షలతో ఒకరిని హతమార్చిన ఘటనలో 14 మందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్టు మెదక్ డీఎస్పీ సైదులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో ఆ వివరాలు వెల్లడించారు. పెద్దశంకరంపేట మండలం బద్దారం గ్రామానికి చెందిన గాజుల రవీందర్(38) లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామ సర్పంచ్ భర్త గడ్డమీది విఠల్‌గౌడ్‌తో గొడవలు ఉన్నాయి. గతంలో విఠల్‌గౌడ్ బైక్‌పై వెళుతుండగా, రవీందర్ లారీతో హత్యాయత్నం చేయగా, గాయాలతో బయటపడ్డారు. అప్పటి నుంచి వారిద్దరి మధ్య తరచుగా గొడవలు జరిగేవి. ఈనెల 8వ తేదీన గ్రామ పంచాయతీ వద్ద గ్రామసభలో నీటి సమస్య విషయంలో ఇద్దరూ గొడవపడ్డారు. అదేరోజు సాయంత్రం గాజుల రవీందర్, భూమయ్య, ప్రభాకర్‌లు పెద్దశంకరంపేటకు వెళ్లి ఆటోలో ఇంటికి తిరిగి వస్తున్నారు. గ్రామ సమీపంలోని పాడుంబాయికుంట వద్ద గడ్డమీది విఠల్‌గౌడ్, గడ్డమీది కిషన్‌గౌడ్, గడ్డమీది సత్యాగౌడ్, గడ్డమీది ప్రవీణ్‌గౌడ్, గడ్డమీది లక్ష్మీనారాయణగౌడ్, కుమ్మరి శ్రీనివాస్, గడ్డమీది అనిల్‌గౌడ్, నిరుడి జయంత్, మంగళి అంజయ్య, మంగళి ఈశ్వరయ్య, బుడ్డ మల్లేశం, మంగళి మారుతి, మంగళి నర్సింలు, కంచర్ల రామాగౌడ్‌లు కాపుగాసి ముగ్గురిపై దాడి చేశారు. గొడ్డళ్లు, కర్రలు, మారణాయుధాలతో దాడిచేయగా గాజుల రవీందర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రభాకర్ పారిపోగా, భూమయ్య తీవ్ర గాయాలతో ముళ్ల పొదల్లో పడిపోయాడు. అయితే చనిపోయాడని భావించి వారంతా వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. అప్పటికే గాజుల రవీందర్ విగతజీవిగా పడిఉన్నాడు. తీవ్ర రక్తస్రావంతో ముళ్ల పొదల్లో పడి ఉన్న భూమయ్యను ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. దర్యాప్తులో భాగంగా అనుమానితులను అదుపులోకి తీసుకొని విచారించగా, తామే హత్య చేశామంటూ 14మంది ఒప్పుకున్నారు. వీరిపై అట్రాసిటీ కేసుతోపాటు, వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. కేసు ఛేదనలో చొరవ చూపిన అల్లాదుర్గం సీఐ జార్జ్, ఎస్‌ఐలు బాలరాజ్, సత్యనారాయణ, లింగం, విజయ్‌లతో సిబ్బందికి క్యాష్ రివార్డు అందజేస్తామన్నారు.

సైకిల్ పైనుంచి పడి వ్యక్తి మృతి

పటాన్‌చెరు టౌన్: ప్రమాదవశాత్తు సైకిల్ పైనుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ దుర్గయ్య కథనం ప్రకారం.. శేరిలింగంపల్లి గోపీనగర్‌కు చెందిన కుమ్మరి నర్సింలు(53) రోజువారి కూలీగా పని చేస్తున్నాడు. గురువారం తన సైకిల్‌పై ఇస్నాపూర్‌కు బయలుదేరాడు. పటాన్‌చెరు శివారులోకి రాగానే రోడ్డు పక్కన వర్షపు నీరు పోయే కాలువలో ప్రమాదవశాత్తు పడి అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల ద్వారా పోలీసులకు సమాచారం అందింది. కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించారు.

గొర్రెల మందపై కుక్కల దాడి



కుక్కల దాడిలో మృతి చెందిన గొర్రెలు

హుస్నాబాద్: పట్టణంలోని ఎల్లంబజార్ సిద్దేశ్వరగుట్టపై ఉన్న గొర్రెల మందపై గురువారం అర్ధరాత్రి కుక్కలు దాడి చేశాయి. దీంతో వల్లపు ముత్తయ్యకు చెందిన ఐదు గొర్రెలు మృతి చెందాయి. దాదాపు రూ.60వేల నష్టం వాటిల్లందని బాధితుడు వాపోయాడు. గతంలోనూ తన గొర్రెలమందపై కుక్కలు దాడి చేశాయని, వాటి బెడద లేకుండా చూడాలన్నారు. మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, కౌన్సిలర్ వల్లపు రాజు ముత్తయ్యను పరామర్శించారు.

అట్రాసిటీ కేసుపై ఏసీపీ విచారణ

మద్దూరు(హుస్నాబాద్): ధూల్మిట్ట మండలం బెక్కల్‌లో నమోదైన అట్రాసిటీ కేసుపై హుస్నాబాద్ ఏసీపీ వాసాల సతీష్ విచారణ చేపట్టారు. ఈ నెల 7వ తేదీన బెక్కల్ గ్రామానికి చెందిన బొల్లు శ్రీనివాస్ తనను కులం పేరుతో దూషిస్తూ, గాయపర్చాడని అదే గ్రామానికి చెందిన యాట మధు మద్దూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. యాటమధు కూడా తనను గాయపర్చాడని శ్రీనివాస్ ఫిర్యాదు చేశాడు. దీంతో శ్రీనివాస్‌పై అట్రాసిటీ కేసు, యాట మధుపై దాడి కేసు నమోదు చేశారు. గ్రామానికి వచ్చిన ఏసీపీ అట్రాసిటీ కేసుపై వివరాలు సేకరించారు.

బాల్య వివాహాన్ని అడ్డుకున్న అధికారులు

చిన్నశంకరంపేట(మెదక్): అధికారులు ఓ బాల్యవివాహాన్ని అడ్డుకున్నారు. చిన్నశంకరంపేటలో ఓ బాలిక(16) వివాహం చేసేందుకు శుక్రవారం కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేశారు. విషయం తెలుసుకున్న చిన్నశంకరంపేట తహసీల్దార్ మహేందర్‌గౌడ్, ఎస్‌ఐ సుభాష్‌గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శైలజ బాలిక ఇంటి వద్దకు చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. బాల్య వివాహం చట్టరీత్యానేరమని, 18 ఏళ్లు నిండే వరకు బాలికకు వివాహం చేయవద్దని కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ ఇచ్చారు.

మట్టి అక్రమ రవాణా అడ్డుకున్నారని...

మనోహరాబాద్(తూప్రాన్): అనుమతులు లేకుండా కొంతమంది ప్రభుత్వ, అటవీ భూముల నుంచి అక్రమంగా మట్టిని తరలిస్తుండగా, గ్రామస్తులు అడ్డుకున్నారు. దీంతో మట్టి తరలిస్తున్నవారు అడ్డుకున్న వారిపై దాడి చేశారు. ఈ సంఘటనలో ఒకరికి తీవ్రగాయాలయ్యా యి. ఎస్‌ఐ సందీప్‌రెడ్డి కథనం ప్రకారం.. మండలపరిధిలోని రంగాయపల్లి శివారులోంచి కొంతమంది అక్రమ ంగా మట్టిని తరలిస్తుండటంతో గ్రామస్తులు గురువారం రాత్రి అడ్డుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన శ్రీనివాస్‌పై సాయి దాడి చేసి కొట్టాడు. దీంతో సాయిపై కేసు నమోదు చేశారు. అటవీ భూమిలోంచి అక్రమంగా మట్టిని తరలిస్తున్నారనే సమాచారంతో ఫారెస్ట్ అధికారులు సంఘటన స్థలానికి వెళ్లి నాలుగు మట్టి టిప్పర్లను పట్టుకొని కార్యాలయానికి తరలించారు.



ఫారెస్ట్ అధికారులు పట్టుకున్న టిప్పర్లు

విద్యార్థిపై వీధికుక్కల దాడి



కుక్కకాటుకు గురైన ముదాబ్బిర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఓ విద్యార్థిపై వీధి కుక్కలు దాడి చేసిన సంఘటన తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. విద్యుత్‌కాలనీలో నివాసముండే ముదాబ్బిర్ ఇంటర్ చదువుతున్నాడు. శుక్రవారం మధ్యాహ్న సమయంలో ఇంట్లోంచి బయటకు వచ్చాడు. ఆ సమయంలో వీధికుక్కలు ఒక్కసారిగా ఆ విద్యార్థిపై దాడి చేయడంతో గాయాలయ్యాయి. వెంటనే కుటుంసభ్యులు పటాన్‌చెరు ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స చేశారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం నారాయణగూడకు తరలించారు. కాలనీలో ఏ వీధికి వెళ్లినా వీధి కుక్కలగుంపు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య



గోపాల్ (ఫైల్)

రామాయంపేట(మెదక్): అనారోగ్యంతో బాధపడుతున్న ఓ వ్యక్తి రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళితే రామాయంపేట తండాకు చెందిన గుగ్లోత్ గోపాల్(32) బతుకుదెరువు కోసం విదేశాలకు వెళ్లివచ్చాడు. ఇటీవల ప్రమాదానికిలోనై గాయపడి గోపాల్ ఇంటి వద్దనే ఉంటున్నాడు.అప్పటి నుంచి మనోవేదనకు లోనవుతున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం అందరూ చూస్తుండగా, అక్కన్నపేట రైల్వేస్టేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో అతని తల శరీరంనుంచి వేరు అయ్యింది. మృతుడికి భార్య జమునతోపాటు ముగ్గురు సంతానం. రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వాసవీక్లబ్ ప్రమాణ స్వీకారోత్సవం

సదాశివపేట(సంగారెడ్డి): అంతర్జాతీయ స్థాయిలో 2వేల వాసవీక్లబ్‌ల ద్వారా రూ.20 కోట్లతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని ఆ క్లబ్ జాతీయ ఉపాధ్యక్షుడు చందా శ్రీధర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని వాసవీకన్యకాపరమేశ్వర మందిరంలో సదాశివపేట వాసవీక్లబ్ నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారం నిర్వహించారు. పట్టణ వాసవీ క్లబ్ అధ్యక్షుడు బుగ్గారం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బాసెట్టి పాండురంగం, ట్రెజరర్ బుసభరత్, కార్యవర్గ సభ్యులతో జిల్లా గవర్నర్ మానేపల్లి రామారావు ప్రమాణస్వీకారం చేయించారు.ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు తోపాజి అనంతకిషన్, జిల్లా అధ్యక్షురాలు పురం రజని, కౌన్సిలర్ అపర్ణపాటిల్, ఉపాధ్యాయులు సంగీతలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ జాతీయ కోశాధికారి పుల్లూరి ప్రకాశ్ పాల్గొన్నారు.



వాసవీ క్లబ్ నూతన అధ్యక్ష, కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం

లింక్ పంపి.. డబ్బు కొట్టేసి

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు ఆమె తెలిపారు.

- సిద్దిపేట పట్టణంలోని ఓ బాధితుడి ఫోన్‌కు గుర్తు తెలియనివ్యక్తి ఓ లింకు పంపాడు. బాధితుడు దానిని ఓపెన్ చేయడంతో రూ.650 కోల్పోయాడు.
- గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఓ బాధితుడికి గుర్తు తెలియనివ్యక్తి ఫోన్ చేసి మీరు ఉద్యోగానికి ఎంపిక అయ్యారు..అందుకు కొన్ని డబ్బులు చెల్లించాలని ఓ లింకు పంపాడు. అది ఓపెన్ చేసిన బాధితుడు తన ఖాతాలోని రూ.64,282ను కోల్పోయాడు. దీంతో బాధితుడు వెంటనే 1930కు ఫిర్యాదు చేశాడు.

కుంటలో తేలిన మృతదేహం
గల్లంతయిన వ్యక్తి మృతి



మేదరి అశోక్ (ఫైల్)

నారాయణఖేడ్: హోలీరోజున కుంటలో గల్లంతయిన మేదరి అశోక్(36) శవమై తేలాడు. మండల పరిధిలోని తుర్కాపల్లికి చెందిన అశోక్ ఈ నెల 7వ తేదీన హోలీ అనంతరం స్నానానికి పెద్దమ్మకుంటకు వెళ్లి గల్లంతయిన విషయం విదితమే. రెండురోజులు కుంటలో గాలింపు చేపట్టినా అతడి ఆచూకీ లభించలేదు. శుక్రవారం ఉదయం అశోక్ మృతదేహం కుంటలో తేలగా, ఒడ్డుకు చేర్చారు. మృతదేహం కుళ్లిపోవడంతో వైద్యులను ఘటనాస్థలికి పిలిపించి పోస్టుమార్టం చేయించారు. మృతుడి సోదరుడు చంద్రశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి చెప్పారు.

అదృశ్యమై.. ఆపై చెరువులో శవమై



రవీందర్‌రెడ్డి (ఫైల్)

పటాన్‌చెరుటౌన్: అదృశ్యమైన ఓ యువకుడు పెద్ద చెరువులో శవమై తేలాడు. అమీన్‌పూర్ ఎస్‌ఐ కిష్టారెడ్డి కథనం ప్రకారం..మండలపరిధిలోని కిష్టారెడ్డిపేట మైత్రిమెడోస్‌కు చెందిన రవీందర్‌రెడ్డి(29) బీటెక్ చదివాడు. కొంతకాలంగా అనారోగ్యంతో పాటు మానసికస్థితి బాగాలేక ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలోనే ఈ నెల 8వతేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు రవీందర్ కోసం వెతుకుతున్నారు. మైసమ్మ దేవాలయ సమీపంలో పెద్దచెరువులో రవీందర్ మృతదేహం శుక్రవారం కనిపించింది. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కుటుంబసభ్యులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ప్రభుత్వఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి గోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నీటిగుంతలో పడి వ్యక్తి మృతి

హత్నూర(సంగారెడ్డి): ప్రమాదవశాత్తు నీటిగుంతలో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ లక్ష్మారెడ్డి కథనం ప్రకారం.. హైదరాబాద్ ఫతేనగర్‌కు చెందిన పిట్టల చిన్న బిక్కూర్ (50) బతుకుదెరువు కోసం దౌల్తాబాద్‌కు వలసవచ్చాడు. ఓవైపు కూలి పనిచేస్తూ, మరోవైపు తేనె పట్టుకొని అమ్ముతూ జీవనం సాగించేవాడు. మండల పరిధిలోని కాసాలకు తేనె పట్టేందుకు నాలుగురోజుల క్రితం వచ్చాడు. శుక్రవారం గ్రామశివారులోని ఓ మామిడతోట సమీపంలో ఉన్న నీటిగుంతలో ప్రమాదవశాత్తు పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీట మునిగి మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు ఢీకొని ఇద్దరి మృతి



ఆర్టీసీ బస్సు వద్ద మోహన్, సాయికుమార్ మృతదేహాలు



మోహన్ (ఫైల్)



సాయికుమార్ (ఫైల్)

యువకులిద్దరూ రోజువారీ కూలీలే

కొండాపూర్(సంగారెడ్డి): ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో ఇద్దరు అక్కడిక్కడే మృతి చెందారు. కొండాపూర్ ఎస్‌ఐ వెంకటేశం కథనం ప్రకారం...నారాయణఖేడ్ మండలం దామరిగిద్ద తండాకు చెందిన మన్మోహన్ సింగ్ అలియాస్ మోహన్(22) తన తల్లిదండ్రులతో కలిసి ఆరు సంవత్సరాల క్రితం కొండాపూర్ మండలంలోని గొల్లపల్లికి వలస వచ్చారు. అప్పటి నుంచి అదే గ్రామంలో కూలి పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గొల్లపల్లి గ్రామానికి చెందిన చాకలి సాయికుమార్(20) కూడా రోజువారీ పనులు చేసేవాడు. శుక్రవారం సాయికుమార్, మోహన్‌లిద్దరూ అదే గ్రామంలో పనికి వెళ్లారు. సాయంత్రం ఇద్దరూ కలిసి ద్విచక్ర వాహనంపై మల్లెపల్లిలోని ఏటీఎంలో డబ్బుల విత్‌డ్రా చేయడానికి బయలుదేరారు. సంగారెడ్డి నుంచి మైతాబ్‌ఖాన్‌గూడకు వెళుతున్న ఆర్టీసీ బస్సును మల్లెపల్లి శివారు వద్ద వేగంగా ఢీకొట్టారు. దీంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇద్దరూ అవివాహితులే. సాయికుమార్ తండ్రి నారాయణ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

జహీరాబాద్ టౌన్: పట్టణంలోని బైపాస్ రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. బీదర్ చౌరస్తా నుంచి హైదరాబాద్ వైపు వెళుతున్న డీసీఎంను డ్రైవర్ అల్గోల్ చౌరస్తాలో రోడ్డు పక్కన పార్కు చేశాడు. వాహనం దిగి రోడ్డు దాటుతుండగా రాంగ్‌రూట్‌లో బైక్‌పై వస్తున్న వ్యక్తి డ్రైవర్‌ను ఢీకొట్టాడు. దీంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను వెంటనే జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వారిని హైదరాబాద్‌కు తరలించారు. జహీరాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. నాక్‌లోకల్ కావడంతో గాయపడిన వారి వివరాలు తెలియలేదు.

చేపల వేటకు వెళ్లి...

సిద్దిపేటఅర్బన్: బావిలో చేపలు పట్టేందుకు దిగిన వ్యక్తి ప్రమాదవశాత్తు నీటి మునిగి మృతి చెందాడు. సిద్దిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...చిన్నగుండవెల్లి గ్రామానికి చెందిన మంద మల్లయ్య (45) కూలి పనులు చేస్తున్నాడు. గురువారం ఉదయం 6 గంటల సమయంలో చేపలు పట్టేందుకని చెప్పి ఇంటి నుంచి బయటకు వచ్చాడు. రాత్రి అయినా ఇంటికి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం మృతుడి తల్లి, సోదరి కలిసి అర్బన్ మండలం బూర్గుపల్లి గ్రామ శివారులో వెతుకుతుండగా ఓ బావి వద్ద చెప్పులు, టవల్ కనిపించాయి. దీంతో గజ ఈతగాళ్ల సాయంతో బావిలో వెతకగా మల్లయ్య శవం లభ్యమైంది. మృతుడి కుమారుడు దీక్షిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేసుకున్నారు.





ఈ ప్రయాణం ప్రమాదకరమే కదా...

ద్విచక్రవాహనాలపై ఇలా ప్రయాణం చేస్తే..ప్రమాదకరమేనని ఈ చిత్రాలను చూస్తే అర్థమవుతుంది. గమ్యస్థానానికి చేరుకునే క్రమంలో సిద్దిపేట పట్టణంలోని అంబేద్కర్‌సెంటర్‌లో ఇలా కనిపించారు.

–సాక్షి స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, సిద్దిపేట